క్లుప్తంగా

అదనపు గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయండి



నిర్మాణంలో ఉన్న గదులను పరిశీలిస్తున్న ఈఈ లక్ష్మీనారాయణ, ఏఈ సురేష్

జూపాడుబంగ్లా: విద్యార్థుల సౌకర్యార్థం మంజూరు చేసిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను సత్వరమే పూర్తిచేయాలని ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ లక్ష్మీనారాయణ కాంట్రాక్టర్‌కు సూచించారు. సోమవారం ఆయన గురుకుల పాఠశాలకు చేరుకొని నిర్మాణంలో ఉన్న తరగతి గదులను పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం రూ.1.08 కోట్ల నాబార్డు నిధులతో అదనపు తరగతి గదులు మంజూరు చేసినట్లు తెలిపారు. నిర్మాణం పనులను ఇప్పటికే పూర్తిచేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ నత్తనడకన పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. వెంటనే గదుల నిర్మాణం పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. ఈయన వెంట ఏఈ సురేష్ ఉన్నారు.

రేపు శ్రీశైలానికి ప్రెస్ అకాడమి చైర్మన్ రాక

శ్రీశైలంటెంపుల్: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు బుధవారం శ్రీశైలం రానున్నారు. గురువారం ఉదయం శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారు. అనంతరం శ్రీశైలంలో ఏర్పాటు చేసిన డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్స్‌పై మీడియాతో సంభాషిస్తారు. అలాగే సాయంత్రం అక్కమహాదేవి గుహలను కూడా సందర్శిస్తారు. శుక్రవారం ఉదయం శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు.

ఆలయ భూముల కౌలు వేలం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని శ్రీ తాండవమల్లేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి వార్ల దేవస్థాన భూములకు సోమవారం ఆలయ ఈఓ కార్తీక్, దేవదాయశాఖ పర్యవేక్షణాధికారి సాయి జయచందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కౌలుకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. రెండు ఆలయాలకు చెందిన 58 ఎకరాల భూమికి కౌలు వేలం వేయగా రూ.3,83,000 ఆదాయం వచ్చిందని ఈఓ కార్తీక్ తెలపారు. వేలంపాట లో భూమి దక్కించుకున్న వారికి సంవత్సరకాలం పాటు పంటలు పండించుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. గతేడాది ఈ భూ ములకు వేలంపాట నిర్వహించగా రూ.1,85, 000 ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది సగానికి పైగా భూములపై ఆదాయం పెరిగిందని వెల్లడించారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో అదే గ్రామానికి చెందిన డాక్టర్ బోరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 650 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పుట్టి పెరిగిన ఊరుకు ఏదో ఒక రూపంలో సేవ చేయాల ని భావించానన్నారు.ఆరోగ్యమే మహాభాగ్యమని తలంచి వైద్యశిబిరం ఏర్పాటు చేయ డం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచు మాణిక్యమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రమణారెడ్డి, డాక్టర్లు నిషితారెడ్డి, నిఖిల్ ప్రవీ ణ్, క్రాంతికిరణ్, శివబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మునక భూములపై విచారణ



గ్రామంలో విచారణ చేపట్టిన అధికారులు

పగిడ్యాల: మండలంలోని పికే ప్రాగటూరు గ్రామంలో సోమవారం రెవెన్యూ అధికారులు అన్యాక్రాంతమవుతున్న మునక భూములపై విచారణ చేపట్టారు. మండల ఆర్ఐ హైమావతి, వీఆర్వోలు వెంకటస్వామి, హేమలత గ్రామానికి చేరుకొని గ్రామపెద్దలతో బహిరంగంగా విచారించారు. గ్రామానికి చెందిన మాదక్కగారి చిన్న శివన్న, మరికొంతమంది ఇచ్చిన ఫిర్యాదుమేరకు, తహసీల్దార్ ఆదేశాలతో విచారణ చేపట్టామని తెలిపారు. . అత్యధికంగా గ్రామప్రజలు చెప్పిన విషయాలను నోట్‌చేసుకొని తహసీల్దార్‌కు తుది నివేదిక అందజేస్తామన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట సెక్టార్‌లో సోమవారం పోషణపక్వాడ కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కుమారి ఆధ్వర్యంలో సున్నిపెంట, శ్రీశైలం మేకల బండలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సమావేశం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, బాలామృతం తదితర పౌష్టికాహారాహాలపై అవగాహన కల్పించారు.

మున్సిపాలిటీ ఆదాయానికి 'టెండర్'

- మున్సిపల్ వేలాలు పాడేందుకు ముందుకు రాని పాటదారులు
- టెండరు రుసుము తగ్గించిన అధికారులు
- తక్కువ ధరకు దక్కించుకున్న కాంట్రాక్టర్లు
- పాటదారులు కుమ్మక్కయ్యారని కౌన్సిలర్ల ఆరోపణ
- వేలాలను రద్దు చేయాలని డిమాండ్



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం

ఆత్మకూరు: సాధారణంగా మున్సిపల్ వేలాలు అంటే పాటదారులు పోటాపోటీగా పాల్గొంటారు. పలు మున్సిపాలిటీల్లో ఘర్షణలు కూడా జరిగిన ఘటనలు ఉన్నాయి. అయితే ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలో వేలాలు పాడేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. దీంతో మున్సిపల్ అధికారులు టెండర్ల రుసుము భారీగా తగ్గించారు. ఫలితంగా మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడింది. ఇందిలా ఉండగా పాటదారులు కుమ్మక్కై టెండర్ల రుసుము తగ్గించారని మున్సిపల్ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది కంటే భారీగా తగ్గింపు..

పట్టణంలోని దినసరి మార్కెట్, వారపు సంత, బస్టాండ్ ఫీజు, చిన్నకమేళా, చేపలు, చికెన్ అమ్మకాలు, పెద్ద కమేళా సంబంధించి మార్చి 27 న బహిరంగ వేలాలు నిర్వహించారు. అధికారులు రెండు సార్లు వేలం పాటలు నిర్వహించినా వేలం పాట డిపాజిట్ దారులు కుమ్మకై పాటలు పాడకపోవడంతో అధికారులు వేలం వాయిదా వేశారు. వేలం రుసుములు భారీగా ఉన్నాయని, తాము చెల్లించలేమని తగ్గించాలని పాటదారులు కోరారు. దీంతో అధికారులు టెండరు లక్ష్యాలను తగ్గించారు. గతేడాది వారపు సంత రూ.5 లక్షల 43 వేలు పలుకగా, ఈ ఏడాది కేవలం రూ.4 లక్షలుగా నిర్ణయించారు. దినసరి మార్కెట్ ఫీజ్ గతేడాది రూ.7 లక్షలు ఉండగా, ఈ ఏడాది రూ. నాలుగున్నర లక్ష, చిన్న కమేళా గతేడాది రూ.3 లక్షలు ఉంటే ప్రస్తుతం రూ.లక్షా 60 వేలు, బస్టాండ్ ఫీజ్ గతంతో రూ.15లక్షల వెయ్యి ఉండగా, ఈ సారి కేవలం రూ.5 లక్షల 21 వేలు ఉండడం, చికెన్, చేపల అమ్మకం గత సంవత్సరం రూ.లక్ష 90 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.లక్షా 36 వేలు చొప్పున అధికారులు నిర్ధారించారు. దీంతో పాట దారులు ఆ ధరలకే పాట పాడి నిర్ణయించిన ధరకే దక్కించుకోవడం పట్టణంలో చర్చనీయాశమైంది.

కుమ్మక్కైన పాట దారులు

వేలాలు తగ్గించడంతో మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడిందని, మార్చి 27 వ తేదిన నిర్వహించిన వేలంపాటలు రద్దు చేయాలని కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అభివృద్ధి వైపు వెళ్లవలసిన మున్సిపల్ కార్యాలయం ఆదాయంలో వెనుకపడడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క బస్టాండ్ టెండర్ విషయంలోనే మున్సిపాలిటీ రూ.10 లక్షలు నష్టపోయిందని, వేలంపాట దారులు కుమ్మక్కు కావడం వలన వేలంపాటలు తక్కువ పాడారని విమర్శించారు. మళ్లీ వేలంపాటలు నిర్వహించాలని పట్టుబట్టారు.

టెండరు తగ్గించాం



వేలంపాట దారులు రెండు సార్లు వేలం పాటలకు రాకపోవడంతో, ఈ విషయం ఆరా తీస్తే వ్యాపారాలు, ఇసుక లారీలు, అధిక సంఖ్యలో రావడం లేదని ఇందువలన నష్టాలు వస్తున్నాయని డిపాజిట్ దారులు చెప్పడంతో టెండరు తగ్గించి, వేలంలో పాల్గొనాలని కోరాం. చివరకు వేలం పాటలు నిర్వహించగా తక్కువ ధరలకు పలికాయి.

–శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

శనగలబసవన్నకు పరోక్షసేవ



శనగలబసవన్నకు పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీస్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి సోమవారం త్రయోదశి సందర్భంగా ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు శాస్త్రోక్తంగా విశేషపూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాధి అర్చనలను గావించారు. స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

పల్లకీలో మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, అలంకార హారతులు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం నిర్వహించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సీఎం జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ మేనేజర్ బేబి అన్నారు. సోమవారం పట్టణంలోని బీఎస్ఎస్ఆర్ నగర్‌లో సహకార సొసైటీ ఆవరణలో 6,7,24,25వ వార్డులో 89 పొదుపు సంఘాలకు , 45,20,550 పొదుపు ఖాతాల్లో మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలు సీఎం వైఎస్ జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పట్టణ సమాఖ్య ప్రెసిడెంట్ ప్రమీల, మెప్మా సీఎంఎం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం



మహానందిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, అధికారులు

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి తెలిపారు. మహానందిలో సోమవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చలివేంద్రం వద్ద మట్టికుండల్లో నిత్యం మంచినీరు భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వేద పండితులు రవిశంకర అవధాని, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, సూపరింటెండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, అంబటి శశిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



భూమిపూజ కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ తదితరులు

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో వేసవిలో మంచినీటి ఎద్దడి నివారించేందుకు నూతన బోర్ల ఏర్పాటుకు సోమవారం గ్రామసర్పంచ్ మహబూబ్‌బీ, ఎంపీటీసీ సభ్యురాలు కోట్ల రాజ్యలక్ష్మీ , జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో మంచి నీటి ఎద్దడి నివారణకోసం నూతన బోర్లను ఏర్పాటు చేస్తున్నామని, బోర్లు పూర్తయితే పలు కాలనీల్లో నీటిని సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బందెలమాబు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై భయం వద్దు

పాములపాడు:పశువుల ఆరోగ్యంపై రైతులకు భయంవద్దని డాక్టర్ భాస్కర్, డాక్టర్ ఇర్ఫాన్ అన్నారు. ఆదివారం మండలంలోని వేంపెంట గ్రామంలో జొన్నపిలకలు నాము తిని మూడుగేదెలు చనిపోయాయి. ఈ విషయంపై సోమవారం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనం సిబ్బందితో కలిసి పశువైద్యాధికారులు వేంపెంట, సుంకులమ్మ కొట్టాల, శ్రీరాంనగర్ గ్రామాల్లో పర్యటించారు. పాడి రైతులతో మాట్లాడగా అన్ని పశువు లు ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు.జొన్న చేలలో పశువులు మేపవద్దని రైతులకు సూచించారు. జొన్న పిలకలు తిన్నప్పుడు నాము లేదా సైనైడ్ విష ప్రభావం ఉంటుంది కాబట్టి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ప్రసన్న, మనీష్, విజయ తదితరులు పాల్గొన్నారు.

చందా, గుండు ఎత్తేందుకు పోటీపడిన యువకులు

జూపాడుబంగ్లా: తర్తూరులో శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాల్లో గరుడోత్సవ సేవకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈసేవ నాడు స్వామివారు గరుడోత్సవ వాహనం బయలుదేరగానే గ్రామంలో చందా, గుండు ఎత్తే పందెములు నిర్వహిస్తారు. ఎలాంటి ప్రవేశరుసుము లేకుండానే చందా, గుండు ఎత్తే పోటీల్లో ఆసక్తి ఉన్నవారు పాల్గొంటుంటారు. ఆసక్తి ఉన్న వారు చందా, రాతి గుండ్లను ఎత్తి వారి బలాబలాలను ప్రదర్శిస్తారు. పందెంలో గెలుపొందిన వారికి స్వామివారికి అలంకరించిన పూలమాలతో సత్కరిస్తారు. స్వామివారికి అలంకరించిన పూలమాలతో సత్కరించటం వల్ల ఏడాది పొడువునా కష్టాలు వాటిల్లకుండా వారి కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లుతాయని భక్తుల విశ్వాసం.

రైతులకు అందుబాటులో ఉండాలి

నందికొట్కూరు: ఆర్బీకే సిబ్బంది ఎల్లవేళలా రైతులకు అందుబాటులో ఉండాలని వ్యవసాయ శాఖ ఏడీ విజయశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సీజన్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఖరీఫ్‌కు ముందుగానే రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

మహానంది ఆలయంలో కార్పెట్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



ఆలయం నుంచి బయటికి వచ్చే మార్గంలో కార్పెట్ వేసిన దృశ్యం

మహానంది: మహానందీశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి దర్శనం చేసుకుని బయటికి వచ్చే మార్గం, ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ఉన్న క్యూలైన్లలో అధికారులు తాత్కాలికంగా కార్పెట్లు వేశారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో సౌకర్యాలు లేకపోవడంతో మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తుల కాళ్లు మండుతున్నాయనే విషయంపై ఆదివారం సాక్షి దినపత్రికలో ''హే...'భగవాన్'' శీర్షికన ప్రచురించిన వార్తకు ఆలయ అధికారులు స్పందించారు. ఈ మేరకు కార్పెట్లు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా గతంలో వేసవికాలంలో చలువపందిళ్లు ఏర్పాటు చేసేవారు. అయితే గత కొన్నేళ్లుగా వాటి ఊసేలేదు. అధికారులు స్పందించి క్యూలైన్ల వెంట నీడ కల్పించేందుకు షెడ్లు లేదా షామియానాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



తంగడంచలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ అన్వరాబేగం

జూపాడుబంగ్లా: మండలం వ్యాప్తంగా ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఏపీడీ అన్వరాబేగం ఏపీఓ గౌరీబాయికి సూచించారు. సోమవారం ఆమె తంగడంచ చెరువులో అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 3వేల మంది కూలీలు వచ్చేలా చేయాల్సి ఉండగా ప్రస్తుతం 2,702 మంది పనులకు హాజరవుతున్నారని తెలిపారు. కూలీల సంఖ్యను మరింతగా పెంచాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. కూలీలకు గరిష్టస్థాయిలో రోజుకు రూ.272 గిట్టుబాటు కూలి లభించేలా ఉపాధి సిబ్బంది పనులు కల్పించాలన్నారు. అమృత్‌సరోవర్‌లో భాగంగా కూలీలు చెరువులో తవ్విన పూడిక మట్టిని సన్న, చిన్న, మధ్యకారు, మోతుబరి రైతులు సొంతంగా ట్రాక్టర్లను ఏర్పాటుచేసుకొని ఉచితంగా పూడికమట్టిని పొలాలకు తీసుకెళ్లవచ్చునన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈదుల ఈశ్వరరెడ్డి, ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్‌అహమ్మద్, టీఏ వెంకటేశ్వరమ్మ, ఎఫ్ఏ రోశన్న తదితరులు పాల్గొన్నారు.

మెగాగోకులం స్థలంపై విచారణ

మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలో వివాదస్పదంగా మారిన మెగాగోకులం షెడ్డు నిర్మాణ స్థలాన్ని ఏపీడీ అన్వరాబేగం సోమవారం పరిశీలించి విచారణ చేపట్టారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన సరోజ, కమల, జమ్మక్క, సుంకమ్మ, మహేశ్వరి, స్వప్న, ఎం.సుంకమ్మ, శ్యామలాబాయి అనే వారికి సర్వేనెంబర్ 711లో 2006లో ఒక్కొక్కరికి 3 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం ఇచ్చినట్లు తెలిపారు. అదే స్థలాన్ని 2018లో మెగాగోకులం షెడ్డు నిర్మాణానికి కేటాయించినట్లు వెల్లడించారు. ఆ స్థలంలో మెగాగోకులం షెడ్డు నిర్మాణం కోసం కొంత మేర పనిచేయగా అందుకుగాను రూ.1,48,581లు బిల్లులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మెగాగోకులం షెడ్డు నిర్మాణం పనులు నిలిచిపోయినందున తామిచ్చిన స్థలాన్ని తమకు కేటాయించాలని, మంజూరు చేసిన బిల్లులను వెనక్కి చెల్లిస్తామని లబ్ధిదారులు డ్వామా పీడీకి దరఖాస్తు చేసుకున్నారన్నారు. పీడీ ఆదేశాల మేరకు తాను విచారణ చేపట్టినట్లు తెలిపారు. కాగా తన పరిశీలనలో ఆ స్థలంలో మెగాగోకులం షెడ్డు నిర్మాణం పనులు చేపట్టిన ఆనవాళ్లు కనిపించలేదన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన



నాడు-నేడు పనుల్లో చేపట్టిన టాయిలెట్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్ర ప్రభుత్వం మొదటి ఫేజ్ కింద చేపట్టిన 'నాడు–నేడు' పనుల నాణ్యత, వాటి నిర్వహణ పై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి. రవీంద్రారెడ్డి సోమవారం పరిశీలించారు. గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలో నాడు–నేడు కింద చేపట్టిన ఎలక్ట్రికల్, డ్రింకింగ్ వాటర్, డైనింగ్‌హాల్, టాయిలెట్లను పరిశీలించారు. టాయిలెట్స్ నందు నీటి సదుపాయం లేదని గుర్తించారు. వెంటనే నీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో మరిన్ని తనిఖీలు చేపడతామని నిర్వహణ పనితీరు సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని పీఓ అధికారులను హెచ్చరించారు.

నేడు మహానందికి చాగంటి కోటేశ్వరరావు

మహానంది: బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మంగళవారం ఉదయం మహానందికి వస్తున్నట్లు ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు సోమవారం తెలిపారు. నంద్యాలలోని ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానం వద్ద ప్రవచనాలను చెప్పేందుకు వస్తున్న ఆయన ఉదయం ఏడు గంటలకు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు రానున్నారని చెప్పారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా... యువకుడి దుర్మరణం



మాదుగుల శ్రీకాంత్(ఫైల్)

కొత్తపల్లి: అదుపుతప్పి ట్రాక్టర్‌బోల్తా పడడంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని చిన్నగుమ్మడాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు మండలంలోని ఎం.లింగాపురం గ్రామానికి చెందిన మాదుగుల ఆంజనేయులు(అంజలన్న)కు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు సంతానం. ఆంజనేయులు రెండునెలల క్రితం ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ట్రాక్టర్‌కు అవసరమైన వ్యవసాయ పనిముట్లను చిన్న కుమారుడు మాదుగుల శ్రీకాంత్(25)తో కలిసి చిన్నగుమ్మడాపురం గ్రామం నుంచి తీసుకొచ్చే క్రమంలో గ్రామ సమీపంలోని బస్సు షెల్టర్ వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న వాగులో పడింది. దీంతో శ్రీకాంత్ ముక్కులో నుంచి రక్తం వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



జలకనూరులో జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ తిరుమలేశ్వరరెడ్డి

మిడుతూరు: ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని జలకనూరు, బైరాపురం, కడుమూరు, పైపాలెం, గ్రామాల్లోని జగనన్న లే– అవుట్‌లోని జగనన్న ఇంటి నిర్మాణాలను, జలకనూరు, చెరుకుచెర్ల, కడుమూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. గ్రామాల వారీగా ఇళ్ల నిర్మాణాలు ఏఏ దశలలో ఉన్నాయని ఆరా తీశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమేష్, పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పశువులకు గాయాలు

పగిడ్యాల: ప్రమాదవశాత్తు పశువుల కొట్టానికి నిప్పు కోవడంతో ఆరు పశువులకు గాయాలైన ఘటన సోమవారం పగిడ్యాలలో చోటుచేసుంది. గ్రామానికి చెందిన తెలుగు శేఖర్‌కు చెందిన ఎద్దులు, ఆవులను కల్లంలోని పశువుల కొట్టంలో కట్టేసి వాటి ఆలనాపాలన చూసుకునేవాడు. అయితే సోమవారం రాత్రి పశువుల కొట్టానికి నిప్పంటుకోవడం చూసిన చిన్నారి తెలుగు ఆంజనేయులు కేకలు వేశాడు. దీంతో స్థానికులు ఏకమై మంటలను ఆర్పుతూ పశువులను రక్షించే ప్రయత్నం చేశారు. పశువుల ప్రాణాపాయం తప్పి గాయాలతో బయటపడ్డాయి. సమాచారం తెలుసుకున్నా ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్నలు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదాన్ని గుర్తించిన తెలుగు ఆంజనేయులు అనే చిన్నారికి రూ. 500లు నగదును అందించి అభినందించారు. గాయాలకు గురైన పశువులకు పశువైద్యులు చికిత్సలు చేశారు.

నీటి సమస్య పరిష్కారం

కొత్తపల్లి: స్థానిక జగనన్న కాలనీలో ఏర్పడిన నీటి సమస్యకు అధికారులు పరిష్కారం చూపారు. కాలనీలోని బోరుకు విద్యుత్‌మోటర్ బిగించి నీటి సౌకర్యం కల్పించారు. సోమవారం ఎంపీడీఓ మేరి బోరును పరిశీలించారు. త్వరలోనే విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడి ఉన్నారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న' విజయవంతం చేయండి

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కొట్టాలచెర్వు, కురుకుంద, శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. కోట్ల నాగేశ్వరరెడ్డి, శంకర్, బందెలమాబు, రాము పాల్గొన్నారు.

శ్రీశైలంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో వారాంతపు రోజులైన శని, ఆదివారాల్లో పెరిగిన రద్దీ శివునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం కూడా కొనసాగింది. భక్తులతో శ్రీశైలక్షేత్రంలోని పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిటకిటలాడాయి. వేకువజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించుకోవడానికి తరలి రావడంతో పాతాళగంగ స్నానఘట్టాలు కిటకిటలాడుతూ కనిపించాయి. ఆలయాధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం

శ్రీశైలదేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన ఎస్ లలిత రూ.1,00,000 విరాళంగా అందజేశారు. విరాళాల కేంద్రంలోని అధికారులకు నగదు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండు అందజేశారు.

మహానందిలో మహారాష్ట్ర భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయంలో సోమవారం మహారాష్ట్ర భక్తుల సందడి నెలకొంది. స్వామివారికి ప్రీతికరమైన వారం కావడంతో రెండు తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులు ముందుగా కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనాలు రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగాయి.

'పది' పరీక్షలు ప్రారంభం



ఆత్మకూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద పరీక్షకు హాజరైన విద్యార్థులు

సాక్షి నెట్‌వర్క్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. అన్ని మండలాల్లో తొలిరోజు తెలుగు పరీక్ష ప్రశాంత వాతారవణంలో జరిగింది. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థుల దాహం తీర్చేందుకు మంచినీటి సౌకర్యంతో పాటు మౌలిక వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మిడుతూరులోని పరీక్ష కేంద్రాలను సర్వశిక్ష అభియాన్ జిల్లా కో–ఆర్డినేటర్ రఘురామిరెడ్డి నేతృత్వంలోని ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. పగిడ్యాలలో లక్ష్మాపురంకు చెందిన ప్రైవేట్ విద్యార్థిని రేణుక జ్వరం బారినపడి తీవ్ర అస్వస్థతకు గురైంది. అక్కడే వున్న వైద్య సిబ్బంది సత్వరం వైద్యసేవలు అందించారు. పాములపాడులో మాజీ ఎంపీపీ దంపతుల కుమారుడు జీఎం రవి మజ్జిగ పంపిణీ చేశారు.